**RELEASED FROM**
**CPI(M) state office**
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202
E-mail: cpimap@gmail.com

# - వామపక్ష పార్టీలు

ప్రచురణార్థం/ ప్రసారార్థం :

విజయవాడ,
తేది: జూలై 31, 2017.

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో "దళితులపై దాడులు - కుల వివక్షను ఖండిస్తూ" జూలై 31న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన రాష్ట్ర సదస్సు తీర్మానం చేసింది. ఈ సదస్సుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షత వహించారు. సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

ఈ తీర్మానంపై సిపిఐ(యం.యల్) న్యూడెమోక్రసీ - వై.సాంబశివరావు, యం.సి.పి.ఐ (యు) - యం.వెంకటరెడ్డి, సిపిఐ(యం.యల్) - గుర్రం విజయకుమార్, సిపిఐ(యం.యల్) లిబరేషన్ - బి. బంగారరావ్, సిపిఐ (యం.యల్) న్యూడెమోక్రసీ - చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఫార్వర్డ్ బ్లాక్ - పి.వి.సుందరరామరాజు, యస్.యు.సి.ఐ(సి) - గోవిందరాజులు ప్రసంగించారు. సదస్సు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

## తీర్మానం

పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్న కక్షతో భూస్వాములు, పెత్తందార్లు దళితులపై సుమారు గత మూడు నెలలుగా సాంఘిక బహిష్కరణ కొనసాగిస్తున్నారు. దళితులను వ్యవసాయ పనులకు పిలవకపోవడమే కాక కౌలుకు సాగు చేస్తున్న భూములను కూడా అగ్రవర్ణ భూస్వాములు గుంజుకోవడంతో పేదలు ఉపాధి కోల్పోయారు. సాంఘిక బహిష్కరణ జరిగినపుడు దళితులకు ఇవ్వవలసిన పరిహారం, సహాయం అందించవలసింది పోయి ప్రభుత్వ యంత్రాంగం వారిపై నిర్బంధం ప్రయోగించడాన్ని గర్హిస్తున్నాం. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌తో సహా ఎంతోమంది ప్రభుత్వ పెద్దలు గ్రామానికి వెళ్ళినప్పటికీ దళితులపై ఇప్పటికీ సాంఘిక బహిష్కరణ కొనసాగించడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని విధితం చేస్తుంది. మంత్రుల బృందం పర్యటించి బాధితులకు ప్యాకేజి ప్రకటించినప్పటికీ ఇంతవరకూ ఏఒక్క హామీ అమలు కాలేదు. ఈ నేపథ్యంలో దళితుల్లో ఆగ్రహావేశాలు కానవస్తున్నాయి. మరో రెండు వారాల గడువులో ప్యాకేజి అమలు చేయకపోతే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని ఈ సదస్సు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నది.

కృష్ణాజిల్లా నందివాడ మండలం ఇలపర్రు గ్రామంలో 138 దళిత కుటుంబాలు 165 ఎకరాలు తమకిచ్చిన భూములను అగ్రకుల పెత్తందార్లు ఆక్రమించుకున్నారని సంవత్సరంపైగా అలుపెరగని పోరాటం నడుపుతున్నారు. ఈ మండలంలో 5 వేల ఎకరాలు దళితులకిచ్చిన అస్సైన్డ్ భూములు అన్యాక్రాంతమైనాయి. గుడివాడ రెవెన్యూ డివిజన్‌లో దాదాపు 25 వేల ఎకరాలు అస్సైన్డ్ భూములు అన్యాక్రాంతమైనాయి. జిల్లాలో సుమారు లక్ష ఎకరాలు ఇలాంటి భూములు ఉన్నాయి. వీటిపై దళితులు సాగించే పోరాటాన్ని ఈ సదస్సు బలపరుస్తోంది.

ప్రకాశం జిల్లా పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలో తమ తాతల, తండ్రుల కాలంనుండి దళితులు సాగు చేసుకుంటున్న భూములనుండి నీరు - చెట్టు పేరుతో వెళ్ళగొట్టడానికి స్థానిక పెత్తందార్లు ప్రయత్నిస్తున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న దళితులకు రాష్ట్ర ప్రభుత్వం 1976లో పట్టాలిచ్చింది. సాగులో వున్న భూములనుండి దళితులను తొలగించరాదని, ప్రత్యామ్నాయం లేకుండా చర్యలుండరాదని కోర్టు చెప్పింది. అయినా పెత్తందార్లు దళితులు 70 సంవత్సరాలనుండి సాగుజేసుకుంటున్న భూములను రాత్రికి రాత్రే వందలాది పోలీసుల రక్షణతో చెరువులుగా మార్చారు. పర్చూరు నియోజకవర్గంలోని భీమవరం, పూసపాడు గ్రామాల్లో దళితులను భూములనుండి తొలగించారు. ఇడుపులపాడు,

"త్రిప్పి చూడగలరు"

వంకాయలపాడు లాంటి ఇంకా కొన్ని గ్రామాల్లో దళితులను భూములనుండి తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారు. జూలై 30న మంత్రి నక్కా ఆనందబాబు, జూపూడు ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు మాల్యాద్రి తదితరులు ప్రభుత్వం తరపున దేవరపల్లిలో పర్యటించారు. ప్రభుత్వంతోనూ, అధికారులతోనూ సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి తోడ్పడతామని చెప్పి వెళ్ళారు. దళితులు చెరువును పూడ్చి తమ భూములు యధా ప్రకారం అప్పుజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కి సంపూర్ణ మద్ధతు ఈ సదస్సు ప్రకటిస్తోంది.

చిత్తూరు జిల్లాలో సుమారు 140 కేంద్రాల్లో మహాభారత ఉత్సవాలు జరుగుతాయి. వీటిలో అగ్ని గుండాలు తొక్కుతారు. దళితులకు ప్రవేశం లేకుండా అనాగరిక కులవివక్ష కొనసాగుతోంది. పెత్తందార్లు వివిధ రూపాల్లో వివక్షను అమలు జరుపుతూ దళితుల భూములను గుంజుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నగ్నంగా కులవివక్ష అమలు జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. చదువుకున్న యువతీ, యువకులు ఇటీవల కాలంలో మహాభారత ఉత్సవాల్లో కులవివక్ష రద్దుకావాలని డిమాండ్ ప్రారంభించారు. తమ భూములు తమకు అప్పుజెప్పాలని కోరుతున్నారు. కనీస పౌర సదుపాయాలు గ్రామంలో ఇతరులతో సమానంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దళితులు, ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాలు పెద్దఎత్తున ఆందోళన చేసిన ఫలితంగా జిల్లా యంత్రాంగం మహాభారతంలో వివక్షకు తావులేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్, ఎస్పీల జోక్యంతో ఉత్సవ కమిటీ మరియు పోరాట కమిటీకి మధ్య చర్చలు జరిపించారు. ఉత్సవంలో దళితులకు కూడా సమానంగా అవకాశం కల్పించే ఒప్పందాన్ని అమలు జరపడానికి అంగీకరించారు. అక్కడి ప్రజాసంఘాల వేదిక ఒప్పందం అమలుకు కృషి చేస్తామని ప్రకటించింది. ఈ ఉద్యమానికి రాష్ట్ర సదస్సు సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తోంది.

పై ఘటనలతోపాటు దళితులపై అనేక చోట్ల దాడులు, అణిచివేతలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కులవివక్ష వ్యతిరేక వాతావరణం సృష్టించడానికి వీలుగా ప్రచారాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. వివక్షకు పాల్పడుతున్న అగ్రకుల పెత్తందార్లను అదుపు చేయడానికి ప్రభుత్వం యంత్రాంగం పూనుకోవాలి. పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని అమలు జరపాలని సదస్సు డిమాండ్ చేస్తున్నది. చాపరాయి 16 మంది గిరిజనుల మరణం కూడా ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది.

**డిమాండ్స్**

**(1)** **పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.**

**(2)** **దేవరపల్లి దళితుల భూములను వెంటనే దళితులకు అప్పగించాలి.**

**(3)** **చిత్తూరు జిల్లా మహాభారతం ఉత్సవాల్లో కుల వివక్ష లేకుండా ఒప్పందం అమలు జరిగేట్టు చర్యలు తీసుకోవాలి.**

**(4)** **వివిధ ఆందోళనల సందర్భంగా అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.**

**(5)** **ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని పకడ్బంధీగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.**

**(6)** **కులవివక్షను నిర్మూలించడానికి వీలుగా అన్ని జిల్లాల్లోనూ దశలవారీ ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాలి.**

**(7)** **అన్యాక్రాంతం అయిన అసైన్డ్ భూముల్ని తిరిగి దళితులకు అప్పుజెప్పాలి.**

జె. ప్రభాకర్

**(జె. ప్రభాకర్)**

సిపిఐ(యం) ఆఫీసు కార్యదర్శి